క్లుప్తంగా

లాకర్లు ప్రారంభం



ప్రత్తిపాడులో లాకర్లను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి భాను

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలోని బార్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన లాకర్లను న్యాయమూర్తి కాటం భాను సోమవారం ప్రారంభించారు. మంచికంటి శ్రీనివాస భారతి, గరిమెళ్ల సుబ్రహ్మణ్యం ఆర్థిక సహకారంతో బార్ కార్యాలయంలో ఈ లాకర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టంశెట్టి పుల్లయ్య, బొంగుభూరి మధుబాబు, బార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి చర్యలు



తునిలో కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోనూ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 28వ వార్డులో కౌన్సిలర్ చింతకాయ భారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. నిధుల లభ్యతను బట్టి దశల వారీగా అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచంద్రరెడ్డి, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎంఈఓ–2గా 'కొండబాబు'



రౌతులపూడి: మండల విద్యాశాఖాధికారి–2గా గాడి కొండబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో 15 ఏళ్ల పాటు ఆయన ఎంఈఓగా పని చేశారు. అప్పట్లో ప్రభుత్వ సర్వీసు నిబంధనల అనుసరించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఇప్పటివరకూ కొనసాగారు. తాజాగా ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకొచ్చిన మార్పుల్లో భాగంగా కొత్తగా ఎంఈఓ–2 పోస్టును ఏర్పాటు చేసింది. ఈ మేరకు కొండబాబును రౌతులపూడి ఎంఈఓ–2గా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. మండలంలోని ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీ



తూర్పులక్ష్మీపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పనుల వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. కూలీలకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగభార్గవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై గల శారదా వయోవృద్ధ నిలయంలోని వృద్ధులకు పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను సోమవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, కందిమళ్ల సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పుస్తక పఠన దినోత్సవం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ పుస్తక పఠన దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీకే మెహర్ ఆధ్వర్యంలో పీఎన్ దినకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. జ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు పి.జాన్‌కిరణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వసతుల కరవు

- వారపు సంతల్లో కానరాని సౌకర్యాలు
- రోడ్ల మీదే వ్యాపారాలు
- తరచూ ట్రాఫిక్ సమస్య
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వ్యాపారులు



ప్రత్తిపాడు వారపు సంతలో మెయిన్‌రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలు

ప్రత్తిపాడు: గ్రామాల్లోని ప్రతివారం నిర్వహించే వారపు సంతలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస వసతులు లేకపోవడంతో అటు దుకాణదారులు, ఇటు కొనుగోలు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారపు సంతల్లో వసతులు సమకూర్చడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. ఆదాయం సమకూరుతున్నా అధికారులు వారపు సంతల బాగోగులు పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ పట్టాలు, చెట్ల నీడన క్రయ విక్రయాలు సాగుతున్నాయి. వ్యాపారులకు షెడ్లు లేకపోవడంతో గత్యంతరం లేక ప్రధాన రహదారులపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలుగుతోంది. కనీసం తాగు నీరు కూడా అందుబాటులో ఉంచకపోవడంతో సంతలకు వచ్చే జనం అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో ప్రతి బుధవారం జరిగే వారపు సంతలో తాజా కూరగాయలు, పండ్లు, నిత్యావసరాలు లభిస్తాయి. ప్రత్తిపాడు చుట్టుపక్కల గ్రామాలైన ధర్మవరం, ఏలూరు, టి.రాయవరం, పి. జగన్నాథపురం గ్రామాల నుంచి ప్రజలు సంతకు వస్తారు. కాగా సంతలో కనీస వసతులు కరువయ్యాయి. షెడ్లు లేకపోవడంతో నడిరోడ్డు మీదే వ్యాపారాలు జరుగుతున్నాయి. సంత రోజున ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో ఇటు వ్యాపారులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వారపు సంతలు.. పల్లె ప్రజల వాణిజ్య కూడళ్లు

మారుమూల గ్రామాల్లో సైతం వారపు సంతలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఈ వారపు సంతలు పల్లె వాసులకు వాణిజ్య కూడళ్లు. ఈ వారపు సంతలకు సమీప గ్రామాల ప్రజలు వచ్చి తమకు వారానికి కావలసిన సరుకులను కొనుగోలు చేసి వెళ్తుంటారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో వారపు సంతలు జరుగుతుంటాయి. ప్రత్తిపాడు మండలం శరభవరంలో ఆదివారం, పెద్దిపాలెంలో సోమవారం, శంఖవరం మండలం పెదమల్లాపురంలో మంగళవారం, శంఖవరంలో శుక్రవారం, ఏలేశ్వరంలో గురువారం, రౌతులపూడి మండలంలో బుధవారం రోజున మాతయ్యపేట, బలరామపురం, ములగపూడిలో గురువారం ఇలా ప్రతి రోజూ సంతలు జరుగుతున్నాయి. ఈ సంతలకు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి పప్పు, ఉప్పు మొదలుకొని తమకు కావాల్సిన అన్ని రకాల సామగ్రి కొనుగోలు చేస్తారు.

30 గ్రామాల నుంచి...

పెద్దిపాలెం, రౌతులపూడి, పెదమల్లాపురం వారపు సంతలకు సుమారు 30 గ్రామాలకు చెందిన గిరిజనులు వస్తారు. తమ అటవీ ఉత్పత్తులను విక్రయించి, తమకు కావలసిన నిత్యావసర వస్తువులను కొనుగోలు చేస్తారు. కాగా ఈ వారపు సంతల్లో షెడ్లు లేకపోవడంతో అనేక మంది వ్యాపారులు రోడ్లకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ సంతల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు లేకపోవడంతో సంతలకు వచ్చే కొనుగోలు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతల్లో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో మరింత ఇబ్బంది



వారపు సంతల్లో వసతులు లేవు. దీంతో వర్షాకాలంలో మరింత ఇబ్బంది పడుతున్నాం. వారపు సంతల్లో షెడ్ల నిర్మాణం చేపట్టి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే రైతులు, కొనుగోలు దారులకు ఎంతో మేలు జరుగుతుంది.
– తటవర్తి అయ్యన్నదొర, రైతు, టి.రాయవరం

వసతులు కల్పించాలి



వారపు సంతల్లో వ్యాపారస్తులకు కనీస వసతులు కల్పించాలి. వ్యాపార నిర్వాహణకు షెడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.
– గుబ్బం వెంకటరమణ, కాయగూరల వ్యాపారి, రౌతుపాలెం

షెడ్లు నిర్మాణానికి చర్యలు



ప్రత్తిపాడు వారపు సంతలో షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. స్థల సేకరణ పూర్తయిన వెంటనే తాగునీరు వంటి కనీస వసతులతో షెడ్లు నిర్మిస్తాం.
– ద్విబాష్యం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, ప్రత్తిపాడు

నేటి నుంచి అవగాహన సదస్సులు

రౌతులపూడి: జగనన్న పాలవెల్లువపై రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం నుంచి గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నట్టు స్థానిక పశువైద్యాధికారి ఎం.వీరరాఘవరావు తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు పి.చామవరం, మధ్యాహ్నం మూడు గంటలకు పారుపాక, 21న ఉదయం గిడజాం, మధ్యాహ్నం ఎస్.అగ్రహారం, 22న ఉదయం లచ్చిరెడ్డిపాలెం, మధ్యాహ్నం ఎస్ఎస్ పట్నం, 23న బలరామపురం, ఎ.మల్లవరం, 24న రాజవరం, ములగపూడి, రౌతులపూడి, శృంగవరం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వివరించారు. రైతులు ఈ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని చైతన్యవంతులు కావాలని కోరారు.

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

గోకవరం: మండలంలో నూతనంగా ఎంపికైన వలంటీర్లకు సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు నియామక పత్రాలు అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏసురత్నం, తోలేటి రాంప్రసాద్, అల్లాడ రాంబాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు



కాకరాపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎంపీపీ లగుడు శ్రీనివాసు తెలిపారు. మండలంలోని కాకరాపల్లి జగనన్న కాలనీలో మౌలిక వసతుల ఏర్పాట్లను సోమవారం వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం జరుగుతున్న కాలనీల్లో మంచినీరు, విద్యుత్ లైన్ల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో నిర్మించిన ఇళ్లకు బిల్లులతో పాటు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారులు వీలైనంత తొందరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దిర్సి రమేష్, కీర్తి బాబ్జీ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నారావు

ఏలేశ్వరం: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి చేపట్టే జగనన్న సురక్ష సర్వేతో అర్హులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ జి.చిన్నారావు అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు అధ్యక్షతన సోమవారం జగనన్న సురక్ష పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నారావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తిస్తామన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ కె.శ్రీనివాసరావు, కౌన్సిలర్ అలమండ చలమయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'జగనన్న సురక్ష' పథకంపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ పథకం విధివిధానాలు, లబ్ధిదారుల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణాలపై సమీక్షించారు. నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐ.జగదీష్, ఈఓపీఆర్డీ జి. అరుణ్‌కుమార్, హౌసింగ్ ఏఈఈ టి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

గండేపల్లి: మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన కేత వీరబాబు గ్రామ శివారులోని పుష్కర కాలువ గట్టుపై సారా తయారు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, సారా తయారీకి సిద్ధం చేసిన పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు గండేపల్లి ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు



అల్లిపూడి కేజీబీవీలో విద్యార్థినిని సత్కరించి మెమెంటో అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు



వీరవరంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన నాయకులు



ప్రత్తిపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రాజరాజేశ్వరి



వి.కొత్తూరు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేసిన నాయకులు

కోటనందూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అల్లిపూడి కేజీబీవీ పాఠశాలలో టెన్త్, ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించిన తొలి ముగ్గురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. మెమెంటో, ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సర్పంచులు తరిపే చినతల్లి, జగటాల వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొరుప్రోలు కృష్ణ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, పాఠశాల ప్రత్యేకాధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

ప్రత్తిపాడు: ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, నగదు బహుమతులను ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ రాజరాజేశ్వరి అందజేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ మేడిబోయిన పెదకాపు, ఉప సర్పంచ్ మదినే నూకరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వీరబాబు, గుడాల వెంకటరత్నం పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని వీరవరం, కిర్లంపూడి జెడ్పీ హైస్కూళ్లలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. వీరవరం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, కిర్లంపూడి హైస్కూల్‌లో విద్యార్థులను సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ ఆధ్వర్యంలో సత్కరించి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్ఎస్ రామ్‌కుమార్, ఎంఈఓ టి.జోసెఫ్, హెచ్‌ఎం ఆకుల శ్రీనివాసరావు, తోట వేణు, ఆళ్ల రామశివ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం మండలంలో..

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పెద్దనాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహుమతులు, ప్రశంసా ప్రత్రాలు అందజేశారు. సిరిపురంలో జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ పీతల నూకరాజు ఆధ్వర్యంలో విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే లోవరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

తుని రూరల్: ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ సూచించారు. మండలంలోని వి.కొత్తూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన ఎం.వీరభవాని, జె.మౌనిక, కె.సువర్ణమయూరిను నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు దుంగల నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయకుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ అమృతవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంపయర్రంపాలెంలో..

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు ఆధ్వర్యంలో సత్కరించారు. నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెడల్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గుప్త, రత్నంరాజు, రమేష్, నాగభూషణం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

కిర్లంపూడి: భూపాలపట్నం గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధి భూపాలపట్నం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1100 స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ సిబ్బంది శ్రీను, నూకరాజు, హోమ్ గార్డ్ ప్రసాద్ పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నిబంధనలు తప్పనిసరి

రౌతులపూడి: ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే గ్రామాల్లో భవన నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీడీఓ ఎం.గోవింద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కాంట్రాక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తాజా మార్గదర్శకాల ప్రకారం నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్లు విధిగా జీఎస్‌టీ కల్గి ఉండాలన్నారు. పనులకు సంబంధించి వంద రూపాయల స్టాంపులపై అగ్రిమెంటు (ఒప్పందం) పత్రాలు అందజేయాలని సూచించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బంది నివేదికను అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పలువురు కాంట్రాక్టర్లు, పలువురు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం



తునిలో మేఘావృతమైన ఆకాశం

తుని: వేసవితాపంలో విలవిల్లాడుతున్న ప్రజలను తొలకరి పలకరించింది. సోమవారం తెల్లవారుజాము నుంచి కొద్దిపాటి చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. భగభగమండే భానుడి తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. మరో నాలుగు రోజుల్లో వర్షాలు కురుస్తాయని, ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

జగ్గంపేట హైస్కూల్‌లో ఆకతాయిల వీరంగం



జగ్గంపేట హైస్కూల్‌లో ఆకతాయిలు ధ్వంసం చేసిన ఫ్యాన్లు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి ఆకతాయిలు వీరంగం సృష్టించారు. క్లాస్ రూమ్స్‌లోకి వెళ్లి స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు ధ్వంసం చేశారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం బి.వేణుగోపాల్ సోమవారం జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగ్గంపేట హైస్కూల్‌లో కొందరు ఆకతాయిలు రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. మద్యం తాగి బాటిళ్లను పాఠశాల ఆవరణలో పగలగొడుతున్నారన్నారు. ఆదివారం రాత్రి మరింత వీరంగం చేసి మూడు క్లాస్ రూముల్లో స్విచ్ బోర్డులు ధ్వంసం చేయడంతో పాటు ఫ్యాన్లు విరగకొట్టారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మలేరియా నివారణపై అవగాహన



గోకవరంలో వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం మలేరియా వ్యాధి నివారణపై గ్రామ వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ మేరీ కృప, ఎంపీహెచ్ఈఓ రాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి ఆవాసాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల మధ్య వ్యర్థాలు, నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగిపోయి మలేరియా, డెంగీ, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మలేరియా వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్, రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి స్పందనకు 14 అర్జీలు

పెద్దాపురం: ప్రతి వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి 14 అర్జీలు అందినట్టు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. మా భూమికి పట్టాదారు పాస్ పుస్తకం కావాలని, భూ తగాదా పరిష్కరించాలని, జగపతినగరం గ్రామంలో ఆక్రమణలు తొలగించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని తదితర సమస్యలపై 14 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. స్పందనలో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందని, ఈ వారం వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించామని ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'నాడు–నేడు' పనుల పరిశీలన

శంఖవరం: మండలంలోని మండపం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తేజ పరిశీలించారు. పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. పనుల్లో నింబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.